# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- వాతావరణ సమాచారం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్రోతో ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది.
- పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, ఆర్థిక భరోసా అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం ఇంగ్లాండ్ పర్యటన ఈరోజుతో ముగిసిందని రాజమహేంద్రవరం ఎంపీ డి.పురందేశ్వరి తెలిపారు.
- యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ఈరోజు రాష్ట్రంలోని పలు తీర ప్రాంతాల్లో సామూహిక యోగాభ్యాసన కార్యక్రమాలను నిర్వహించారు.

====================

ఉపగ్రహం ద్వారా క్షణాల్లో వాతావరణ సమాచారం అందించేలా షార్ ఇస్రోకి చెందినతో ఆంధ్రప్రదేశ్ ఆర్‌టీజీఎస్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సమక్షంలో 5 సంవత్సరాల పాటు వాతావరణ సమాచారాన్ని అందించేలా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఆర్‌టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణా అధికారి ప్రఖర్ జైన్ మధ్య ఈ అవగాహన ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పందం వల్ల వాతావరణ సమాచారం ఉపగ్రహ ఛాయాచిత్రాలతో సహా ఆర్‌టీజీఎస్‌కు చేరతాయి. దీని ఆధారంగా అధికారులు మొబైల్ సందేశాల రూపంలోనూ, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తారు. ఈ ఒప్పందంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు.

====================

ఆర్థికంగా వెనకబడిన మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, ఆర్థిక భరోసా అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాలను

మహిళలు సద్వినియోగం  చేసుకొని.. స్వయం ఉపాధిని పొందాలని ఈ సందర్భంగా సూచించారు. అంతే కాకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా స్థిరపడవచ్చని మంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

====================

ఉగ్రవాదం ఒక క్యాన్సర్ గా ప్రపంచ మేధావులు ఆందోళన చెందుతున్నారని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు, అఖిల పక్ష బృంద సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం సభ్యురాలైన డి. పురందరేశ్వరి ఇంగ్లాండ్ పర్యటనలో  హౌస్ ఆఫ్ కామన్స్ స్పీకర్‌ను కన్జర్వేటివ్ పార్టీ ఛైర్మన్‌ను కలిశామని, మేధావులతో ఆపరేషన్ సిందూర్‌పై సంభాషించామని  తెలిపారు. IMF, ప్రపంచ బ్యాంకు నుండి పాకిస్థాన్ పొందుతున్న రుణం ఉగ్రవాదానికి ఉపయోగించే నిధులా లేదా పేదల కోసమా అని అడగాలని ఈ సందర్భంగా వారిని కోరామని ఆమె వెల్లడించారు. అలాగే ఈ రోజుతో ఇంగ్లాండ్ పర్యటన ముగిసిందని తెలిపారు.

====================

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు పలు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో సామూహిక యోగాభ్యాసన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో పెద్దగణగళ్లవానిపేట తీర ప్రాంతంలో సుమారు 7 వేల మంది మత్స్యకారులతో యోగాభ్యాసన కార్యక్రమం జరిపారు. నిత్య యోగాను సాధన చేయడంతో  ఆరోగ్యకరమైన జీవనం, మానసిక ఉల్లాసం కలుగుతుందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు మైపాడు సముద్రతీరంలో ఈ రోజు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న  జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కే.కార్తీక్ అన్నారు. ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో త్రిపురాంతకంలోనూ, అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త  కలెక్టర్ టి.నిషాంతి ఆధ్వర్యంలో అంతర్వేది సముద్ర తీరంలో మూడు వేల మందితో యోగా సాధన చేయించారు.

====================

కంటి గాయాలకు సంబందించిన కారణాలు, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆక్యులర్ ట్రోమా పేరిట జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్.హెచ్.ఆర్.సి.) దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కంటి గాయాలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు పలు సూచనలు చేస్తోంది. క్రీడలు, ప్రమాదకర పని ప్రదేశాల్లో రక్షణ కళ్ళద్దాలను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచిస్తోంది. కంటి గాయానికి కారణమయ్యే బాణసంచా నిషేధం అమలు చేయడం వంటివి చర్యలు చేపట్టాలని పేర్కొంది.

విరామం

====================

నిత్య శారీరక శ్రమ చేసే కార్మికులకు యోగాసనాలు దివ్య ఔషధంలా పని చేస్తాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈ రోజు బీఆర్‌టీఎస్ యోగా వీధిలో ఆయుష్ మంత్రిత్వ శాఖ, కార్మిక శాఖ, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులతో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... శారీరక, మానసిక రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు యోగాభ్యాసం చేయడం ఉత్తమ మార్గమని కార్మికులు గుర్తించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని కలెక్టర్ తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో... ఐదు లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ రోజు తన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 38 శాతం పచ్చదనాన్ని 50 శాతానికి పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

====================

జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అనంతపురం జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి అనుపమ జేమ్స్ తెలిపారు. ఈ రోజు అనంతపురంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం గోడ పత్రికలను ఆమె ఆవిష్కరించారు. క్షయ వ్యాధి సోకితే తీసుకోవల్సిన జాగ్రత్తలు పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

విజయవాడలో ఈరోజు వీర్ రత్న ఫౌండేషన్, సైనిక సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో సైనిక వితంతువుల వీర్ నారిస్ సాధికారిత కార్యక్రమం ఈ రోజు జరిగింది. విధి నిర్వహణలో మరణంచిన త్రివిధ దళాల సైనికుల కుటుంబాలకు సహాయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్ రత్న ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ దీప్తి శర్మ, ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి అర్చన చక్రవర్తి ఆకాశవాణితో మాట్లాడుతూ... మృతి చెందిన సైనికుల భార్యలు స్వయం ప్రతిపత్తి సాధించేలా టైలరింగ్, అల్లికలు, బ్యాగుల తయారీ, కేకులు, చాక్లెట్స్ తయారీ, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ ఇస్తూ.. ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సైనిక సంక్షేమ విభాగం డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశ రక్షణలో ప్రాణాలు త్యాగం చేసిన వీరజవానుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యుద్ధ వితంతువులకు సాధికారత కల్పించేందుకు నైపుణ్య అభివృద్ధి తోడ్పడుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

====================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 ముగింపు వేడుకలు మరి కొద్ది సేపటి ప్రారంభంకానుంది. ఈ వేడుకల్లో భాగంగా ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత త్రివిధ దళాల ప్రతినిధులను బీసీసీఐ సత్కరించినుంది. ఇక గుజరాత్ లోని అహ్మదాబాద్ వేదికగా ఐపీఎల్ 18వ సీజన్ ఫైనల్ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. తొలిసారి ఐపీఎల్ టైటిల్ ను కైవసం చేసుకోవడం కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పంజాబ్ కింగ్స్ జట్లు పోటీ పడుతున్నాయి.

====================
====================